

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

### (క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

1993–జనవరి

పేపర్ చదువుతున్న పద్మనాభం, పక్కనే మోగుతున్న ఫోన్ ఎత్తాడు.

"హలో, పద్మనాభం హియర్."

"గుడ్ మార్నింగ్ అంకుల్. నేను అశోక్ మాట్లాడుతున్నా."

"అశోక్?"

"అదే, భాను ఫ్రెండ్ అశోక్."

"ఓ, హలో అశోక్. ఎలా వున్నావ్?"

"అయాం ఫైన్ అంకుల్. మిమ్మల్ని ఒక చిన్న ప్రోగ్రాం కి ఆహ్వానిద్దామని ఫోన్ చేసాను."

"అవునా, థాంక్స్ అశోక్. ఏం ప్రోగ్రాం?"

"మా యూనివర్సిటీ కల్చరల్ ఫెస్టివల్. ప్రోగ్రాం సాయంత్రం నాలుగింటి నుంచి ఏడింటి దాకా వుంటుంది. ఆ తరవాత మా హాస్టల్‌లో గెస్ట్స్ కోసం స్పెషల్ డిన్నర్ ఉంటుంది.

ఎల్లుండి శనివారం కాక, ఆ పై శనివారం. మీకు రావటానికి కుదురుతుందా?"

"అయ్ సీ! రావడానికి సమస్యేం లేదు, రెండు రోజుల్లో చెప్తాను. నీ ఫోన్ నంబరేదైనా వుందా?"

"లేదంకుల్, నా దగ్గర ఫోన్ లేదు. నేనే రెండురోజుల్లో ఫోన్ చేస్తా. భాను వుందా?"

"వుంది, పిలుస్తా, ఆగు."

"హలో భానూ! అంకుల్‌తో చెప్పాను. మీరు ముగ్గురూ మా యూనివర్సిటీ కల్చరల్ ప్రోగ్రాంకీ తరవాత డిన్నర్‌కీ వచ్చేయండి. అమ్మ, అమూల్య కూడా వస్తున్నారు. వాళ్ళు శివా, వెంకట్ వాళ్ళతో కలిసి వొస్తున్నారు. ఓకె, నేను పరీక్షల ప్రిపరేషనూ, డాన్స్ రిహార్సల్స్‌తో చాలా బిజీగా వున్నా. తరవాత మాట్లాడతా."

భాను నవ్వుకుంటూ ఫోన్ పెట్టేసింది.

★★★★★★★★★★★★★★★

1993– ఎప్రిల్

ఆశా, కోమలీ, సూసీ, భానులుసినిమా టికెట్లు తెచ్చుకోని, ఇంకా టైముందని ఐస్క్రీములు కొనుక్కొని కూర్చున్నారు. బీటెక్ ఆఖరి సంవత్సరం పరీక్షలు అయిపోయి అందరి మొహాలూ తేటగా వున్నాయి.

"చెప్పవే ఆశా? ఏంటి సంగతులు? ఉద్యోగం ఎలా వుంది? ఈ పాటికి అలవాటయిందా? హాయిగా పరీక్షల బాధ లేదు, వారానికో సినిమా చూసుకోవచ్చు కాదా? " కోమలి ఐస్క్రీం నోటితో అడిగింది.

"ఏముద్యోగమో ఏమోనే! మీరంతా హాయిగా చదువుకుంటూంటే నేనేమో పెద్ద అమ్మమ్మల్లా చీరలు కట్టుకొని రోజూ బాంకుకి వెళ్తున్నా! కొన్నిసార్లు అలా అనిపిస్తుంది కానీ, హాయిగానే వుంది. మీ సంగతులేంటి? పరీక్షలు అందరూ బాగా రాసారా? భానూ, నువ్వేం చెప్పవే?" ఆరిందలా అంది ఆశ.

"అబ్బో, భానూ విశేషాలకేం, చాలానే వుంటాయిలే! సెంట్రల్ యూనివర్సిటీలో డాన్సు ప్రోగ్రాములూ,డిన్నర్లూ, చాలానే వున్నాయి కదా భానూ?" కోమలి వెక్కిరించింది.

"డాన్సు ప్రోగ్రామా? యూనివర్సిటీలోనా? నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది భాను.

"తెలుస్తాయమ్మా! మా పద్ధతులు మాకుంటాయి."

స్నేహితులందరూ నవ్వడంతో భాను మొహం ఎర్రబడింది.

"అది సరే, అశోక్ డాన్సు నీకు నచ్చిందా?" సూసీ కుతూహలంగా అడిగింది.

"డాన్సు బాగానే వుంటుంది కానీ, నాకంత బాగా అర్థం కాదు," దిగులుగా అంది భాను.

"మా అకాడెమీలో అయితే తను చాలా ఫేమస్. మా డాన్స్ టీచర్‌కి తను పెట్ స్టూడెంట్ అనుకో!"

భానుకి రెణ్ణెల కింద యూనివర్సిటీ ఆడిటోరియంలో చూసిన డాన్సు ప్రోగ్రాం గుర్తొచ్చింది. ఆ రోజు డాన్సు ప్రోగ్రాం బాగానే వున్నా, అశోక్ పక్కనే పార్వతి వేషంలో డాన్సు చేసిన అమ్మాయి గుర్తొస్తే తిక్క తిక్కగా వుంది. ఇద్దరూ కలిసి శివ పార్వతుల నాట్యం ఏదో చేసారు. నాట్యమూ, పాటా బానే వున్నా, వాళ్ళిద్దరిని అలా పక్క పక్కనే చూస్తే ఆమెకి మంటగా వుంది. ఆ రాత్రి మిగిలిన సమయమంతా డల్‌గానే వుంది. అశోక్ అడగనే అడిగాడు, "భానూ, ఎందుకంత డల్‌గా వున్నావు? " అని. "ఏం లేదు, కొంచెం పరీక్షల టెన్షన్" చెప్పింది.

ఆ తరవాత మళ్ళీ ఇంతవరకూ అశోక్‌ని కలవడం కూడా కుదరలేదు. ఆ అమ్మాయిని తలచుకుంటే వొచ్చే చిరాకు వల్ల ఉత్తరంకూడా రాయలేదు. అతనే రాస్తాడేమోనని ఎదురు చూస్తూ వుంది. కానీ మే చివరివరకూ పరీక్షలని చెప్పాడు అశోక్. బహుశా బిజీగా ప్రిపేరవుతూవుంటాడు.

"అసలు డాన్స్ అకాడెమీలో మా ఇద్దరినీ వింతగా చూస్తారు, తెలుసా?" సూసీ మాటలతో ఉలిక్కిపడింది భాను.

"అతన్నేమో, మగ పిల్లాడికి డాన్సెందుకబ్బా అనుకుంటారా? నన్నేమో, ఈ క్రిస్టియన్ పిల్లకి శాస్త్రీయ నాటమెందుకు, అన్నట్టు చూస్తారు. మా గురువుగారుకూడా నన్ను చేర్పించుకునేముందు, "అన్ని పాటలూ హిందూ దేవుళ్ళ గురించి వుంటాయమ్మా! మీ ఇంట్లో కూడా చర్చించి ఏదైన అభ్యంతరాలుంటాయేమో ఆలోచించుకో" అన్నారు. అమె అన్నట్టుగానే మా అమ్మా నాన్నా కొంచెం గునిసారు కానీ, నేనే పట్టుపట్టి చేరాను."

"అవునా?" ఆశ్చర్యంగా అడిగింది ఆశ.

"అవును. పాపం, అతనొక్కడే మగపిల్లాడు. కొత్తలో ఇబ్బంది పడేవాడు. కానీ, ఇప్పుడు అలవాటైపోయింది. చిన్న క్లాసుల్లో అబ్బాయిలు చేరతారు కానీ, కొంచెం పెద్దవగానే మానేస్తారు. అతనొక్కడే పదేళ్ళుగా నాట్యం చేస్తున్నాడు."

"అవునూ, మొన్న యూనివర్సిటీ ప్రోగ్రాంలో అతనితో కలిసి ఇంకో అమ్మాయి కూడా డాన్సు చేసింది. తను కూడా బాగా చేసింది. ఇద్దరూ కలిసి "నటనం ఆడినా" అనే పాటకి శివపార్వతుల్లా కలిసి డాన్సు చేసారు. పాట కూడా చాలా నచ్చింది నాకు."

"అదా? అది నటనం ఆడినార్ అనే తమిళ పాట. శివుడి గురించి. "

"తమిళ పాటా? అందుకే నాకు ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు."

"అతని కూడా డాన్స్ చేసిన అమ్మాయెవరు? అకాడెమీలో నేనూ అశోక్ కలిసి చేసాం ఆ డాన్సు."

భానుకి ఎందుకో చిరాకెక్కువైంది.

"ఎవరో, యూనివర్సిటీ అమ్మాయి కాబోలు. చాలా పొడవుగా, భలే అందంగా వుండింది."

భాను మాటలకి సూసీ మొహం ఎందుకో చిన్నపోయింది. అదిచూసి భాను చిరాకు ఇంకా ఎక్కువయింది.

""అది సరే, ఎంత సేపే ఐస్‌క్రీం తినడం? సినిమా మొదలైపోతుంది, పదండి, పదండి." ఆశ తొందరపెట్టింది.

చూస్తున్నది గాయం సినిమా అయినా, భాను మనసు సినిమా మీద లేకుండా పోయింది.

"రేపే ఒక్కసారి యూనివర్సిటీ హాస్టల్ అడ్రసుకి ఉత్తరం రాసి పడేస్తాను. మే చివరిదాకా హాస్టల్‌లోనే వుంటానన్నాడు కాబట్టి ఉత్తరం చూస్తాడు. అసలు పరీక్షలయ్యేంతవరకూ పలకరించకూడదనుకుంది, కానీ, మనసంతా ఆరాటంగా వుంది." నిశ్చయించుకున్నాక, ఆమె మనసులో ఆరాటం తగ్గింది. అంతవరకూ గందరగోళంగా అనిపించిన సినిమా అర్థమవసాగింది ఆమెకి.

★★★★★★★★★★★★★★★★★

1993– మే

డియర్ అశోక్,

బాగున్నావా? చాలా రోజులయింది నిన్ను చూసి. పరీక్షలకు చచ్చేట్టు చదువుతున్నావా? మా పరీక్షలైపోయాయి. కేంపస్ ఇంటర్వ్యూలు కూడా అయిపోయినాయి. నాకొక జాబ్ ఆఫర్ వచ్చింది కానీ, చేరాలో వొద్దో నిర్ణయించుకోలేదు. నాకంతగా నచ్చలేదు. ప్రైవేటు సంస్థలకన్నా, నాకు పబ్లిక్ సెక్టరులో ఉదోగం వస్తే బాగుండని వుంది. ఇప్పటికైతే ఎండాకాలం సెలవులు బాగా ఎంజాయ్ చేస్తున్నా. నిన్ననే నేనూ, ఆశా, కోమలీ, సూసీ "గాయం" సినిమా చూసాము. పాటలు చాలా బాగున్నాయి.

పరీక్షలవ్వగానే కలవడానికి వీలవుతుందా? అన్నట్టు నీ స్నేహితురాలు సూసీ నిన్ను చాలా మిస్ అవుతుంది పాపం. నిన్నంతా నీ గురించే మాట్లాడిందిలే.

ఆ రోజు నీతోపాటు డాన్సు చేసిందే, పార్వతి వేషంలో ఒకమ్మాయి. ఎవరా అమ్మాయి? మీ అకాడెమీలో అమ్మాయేమో అనుకున్నా కానీ, కాదేమో అనిపించింది సూసీ మాటలు వింటూ వుంటే. రెండేళ్ళలో నీతోపాటు డాన్సు చేసే స్నేహితులని సంపాదించుకున్నావు యూనివర్సిటీలో. చాలా బాగుంది.

అమ్మా నాన్నా నా చదువు అయిపోయినందుకు సంతోషించాలో, ఉద్యోగం గురించి బెంగ పడాలో ఇంకా తేల్చుకోలేకుండా వున్నారు. ఎంటెక్ ఎంట్రన్సైతే రెండేళ్ళవరకూ చచ్చినా రాయనని తెగేసి చెప్పేసా.

ఈ ఉత్తరం అందగానే ఎంత బిజీగా వున్నా, ఒక్క రెండు లైన్లైనా వుత్తరం రాయి, ప్లీజ్.

పరీక్షలవగానే కలుద్దాం.

వుంటాను

భాను

★★★★★★★★★★★

మే 10 1993

డియర్ భానూ,

పరీక్షల టెన్షన్‌లో వుండగా  నీ ఉత్తరం రావడం చాలా హాయిగా అనిపించింది. కానీ ఉత్తరం చదివాక నువ్వే ఏదో టెన్షన్‌లో వున్నట్టనిపించింది. ఉద్యోగం గురించి బెంగ పెట్టుకున్నావా? డోన్ట్ వర్రీ!

నేను మే ఇరవయ్యో తారీఖున హాస్టల్ రూం ఖాళీ చేసి ఇంటికెళ్తున్నాను. పీహెచ్‌డీ కి ఇక్కడే అప్లై చేసాను కానీ, నాకింకెక్కడైనా పీహెచ్‌డీ చేయాలని వుంది. చూద్దాం ఎక్కడ తేలతానో.

మే 23, సోమవారం నాడు నేను సీఫెల్ కి వెళ్ళే పని వుంది. నువ్వు పది గంటలకి అక్కడకి రాగలవా? తార్నాక, ఉస్మానియా యూనివర్సిటీ దగ్గరవుంటుంది. అక్కడ చిన్న పని చూసుకొని ఎక్కడైనా లంచ్ చేద్దాం. మనిద్దరికీ ఇదే ఆఖరి సమ్మర్ హాలిడేస్  కావొచ్చు కదా? ఉద్యోగాల్లోనో, పై చదువుల్లోనో చేరితే ఎండాకాలం సెలవలు అనే లగ్జరీ వుండదు. గబగబా పెద్దయిపోతున్నాం అంటుంది మా అమ్మ. ఆంటీ, అంకుల్ బాగున్నారా? నీలాటి స్మార్ట్ స్టూడెంట్ గురించే భయపడితే మా లాటి వాళ్ళ ఫ్యూచర్ సంగతేమిటో!

దేని గురించీ బెంగపడకు భానూ. ఎవిరీ థింగ్ విల్ బీ ఆల్రైట్. నేను పరీక్షకి చదువుకోవాలి భానూ. పైగా ఆఖరి అసైన్‌మెంటు పేపరు పూర్తి చేయాలి. ఈ పేపర్లు రాయడంలో చిక్కేమిటో తెల్సా? ఎంత రాసినా, ఎన్ని సార్లు దిద్దినా, ఇంకా ఏదో రాయాల్సింది మిగిలి వుంటూనే వుంటుంది.

పదిరోజుల్లో నిన్ను కలుస్తాననుకుంటే సంతోషంగా వుంది.

వుండనా

అశోక్.

★★★★★★★★★★★★★★

ఆదివారం మధ్యాహ్నం హాయిగా నిద్రపోతున్న ఆశ, భాను వచ్చిందని తల్లి చెప్పడంతో లేచి బయటికొచ్చింది.

"రావే భానూ! ఏమిటిలా? ఇంత ఎండనపడి వొచ్చావే! కూర్చో. ఒక్క క్షణం మొకం కడుక్కోని వస్తా."

"అలాగే బట్టలు కూడా మార్చుకొని రా. బయటికెళ్ళి ఐస్‌క్రీం తిందాం."

ఏదో అనబోయి ఆశ, భాను మొహం చూసి ఆగిపోయింది.

"సరే, అలాగే, ఇప్పుడే వస్తా."

"అమ్మా, ఇప్పుడే నేనూ భానూ ఐస్క్రీం తినొస్తాం," చెప్పులేసుకొని బయల్దేరుతూ అంది ఆశ.

అమ్మాయిలిద్దరూ ఐస్క్రీం కొనుక్కొని పక్కనే వున్న కుర్చీల్లో కూర్చున్నారు. మే నెల ఎండ కళ్ళు బయర్లు కమ్మేలా వుంది.

"చెప్పు భానూ, ఇంత ఎండలో పడి వొచ్చావు. అంతా ఓకే కదా?"

"ఇవాళైతే ఆదివారం, నువ్వు ఇంట్లో దొరుకుతావు. మళ్ళీ రేపణ్ణించి బేంకు కెళ్ళిపోతావ్ కదా? ఇంత ఎండలో అయితేనే నువ్వు ఇంటిపట్టున దొరుకుతావని, ఇవాళ వొచ్చా. నీతో కొంచెం మాట్లాడాలే."

అవటానికి నలుగురూ మంచి స్నేహితులే ఐనా, ఆశ  వాళ్ళందర్లోకీ కొంచెం నిదానంగా, మెచ్యూర్డ్‌గా ఆలోచిస్తుందని వాళ్ళందరికీ తెలుసు.అందుకే ఆశతో తన మనసులో పీడిస్తున్న భయాలు చెప్పి సలహా తీసుకోవాలనుకుంది భాను.

"చెప్పు మరి, సంగతేంటో!"

"అది కాదే, నీకు అశోక్ తెలుసుగా? నాకెందుకో అశోక్ అంటే మనసులో ఒకలాటి ఇష్టం, సాఫ్ట్ కార్నర్ పెరుగుతున్నాయి. అతను నాగురించేమనుకుంటున్నాడో తెలియదు. స్నేహంగా మాట్లాడతాడు, ఉత్తరాలు రాస్తాడు. అలాగని అతి చనువు చూపించడు. భవిష్యత్తు గురించి స్థిరమైన అభిప్రాయాలున్నట్టు అనిపిస్తాడు. అర్థమయినట్టే వుంటాడు, అర్థమవనట్టూ ఉంటాడు. మా అమ్మా నాన్నలకి అతను అంత నచ్చడు. ఈ స్నేహాన్ని ముందుకు తీసికెళ్ళనా, వొద్దా, అతని మనసులో వున్నది కనుక్కోవడం ఎట్లా, అసలు నా మనసులో యేముంది,  అంతా పెద్ద గందరగోళంగా వుంది ఆశా. దీనికి తోడు ఉద్యోగం వెతుక్కోవాలా, ఇంకా పైన చదువుకోవాలా అన్న కన్ఫ్యూషన్. అమ్మా నాన్నలని అడిగి లాభం లేదు. ఇద్దరూ చెరో మాటా చెప్తారు, పైగా ఒకరి మాట వింటే ఇంకొకరికోపం. అందుకే నేను వాళ్ళని ఏ విషయంలోనూ సలహా అడగను. అంతా నాకే తెలుసన్నట్టు పోజు పెడతా గానీ, మనసంతా చాలా గందరగోళంగా అనిపిస్తుంది. ఒకటి చేస్తే ఇంకోటి చేయాల్సిందేమో అనిపిస్తుంది.  ఎంటెక్ ఎంట్రన్స్ రాయనని చెప్పి అప్లికేషను కూడా పెట్టలేదా, ఇప్పుడు పొరపాటు చేసానేమో, ఉద్యోగం రాకపోతే కనీసం చదువుకునే దాన్ని కదా అనిపిస్తుంది. అమ్మకి నేను అమెరికా వెళ్ళట్లేదని బాధ. నాకసలు ఈ హైదరాబాదు కూడా వదలబుద్ధి కాదు. కాస్త ఈ విషయంలో నాన్నే నయం. నన్ను వదిలి వుండలేననీ, నన్ను అమెరికా వెళ్ళమని వేధించొద్దనీ అమ్మకి సీరియస్‌గా చెప్పారు."

కాసేపు ఇద్దరూ మౌనంగా ఐస్క్రీం తిన్నారు.

"సరే, వన్ థింగ్ ఎట్ ఏ టైం. నీ పెళ్ళి గురించి ఇప్పట్లో అమ్మా నాన్నా ఆలోచించరు. నీకింకా  ఇరవై ఒకటేగా?అశోక్ గురించి నిర్ణయం తీసుకోవడం ఇంకో యేడాది వరకూ పక్కన పెడదాం. ఉద్యోగం గురించి, మొన్న ఒక ప్రైవేటు కంపెనీలో ఆఫరు వచ్చిందన్నావ్ కదే? అదేమయింది?"

"ఒక చిన్న కెమికల్స్ కంపెనీలో ట్రెయినీ ఇంజినీరుగా వచ్చింది. జీతం పెద్ద ఎక్కువగా లేదు, పైగా ఎక్కడో జీడిమెట్ల దగ్గర. పెద్ద ఉత్సాహంగా లేదు."

"ఎన్నేళ్ళూ చేయాలీ వంటి బాండేమీ లేకపోతే ఆ ఉద్యోగం ఒప్పేసుకో. ఇంకేదైనా నీకు నచ్చిన ఉద్యోగం వస్తే, అప్పుడు అందులో చేరిపోవచ్చు."

"బాండేమీ అడగలేదులే. రోజూ జీడిమెట్ల వరకూ వెళ్ళి రావాలంటే.."

"భానూ! కెమికల్ ఇంజినీర్ వుద్యోగం అంటే చాలావరకు కెమికల్ ఫాక్టరీలోనో, మందుల కంపెనీల్లోనో వుంటాయి. మరి అవి పట్టణాలకి దూరంగా ఊరవతల విసిరేసినట్టే వుంటాయి. తప్పదు మరి."

"ఊ.."

"ఇక అశోక్ విషయమంటావా? ఇంకొంచెం టైం తీసుకో. ఇప్పుడేం తొందర లేదు కదా? మీ ఇంట్లో మీ స్నేహం గురించి ఏమైనా కామెంట్ చేసారా?"

"నాన్న కొంచెం చిరాకు పడతారు కానీ, పెద్దగా ఏమీ అనరు. అయితే, నేనూ అశోక్ అప్పుడప్పుడూ కలుస్తామని వాళ్ళకి తెలియదు," కొంచెం సిగ్గుగా మొహమాటంగా అంది భాను.

నవ్వింది ఆశ.

"ఆహా? అంత పెద్ద దొంగవని నాకు తెలియదు లేమ్మా!"

"అది కాదు! నాకేమాత్రం ఈ విషయంలో క్లారిటీ వచ్చినా అమ్మా నాన్నలతో చెప్పేస్తాను. నాకేం భయం లేదు. అంతకు ముందే చెప్పేస్తే, ఉత్తి పుణ్యానికే గొడవలెందుకు, కదా?"

"ఐ అండర్‌స్టాండ్. మరి అతని ఉద్దేశ్యమేంటో ఏమైనా క్లూ దొరికిందా?"

"లేదే! అతని డాన్సేమోకానీ, చుట్టూ ఎప్పుడూ అమ్మాయిలే! అసలు సూసీ అతన్ని గురించి చనువుగా మాట్లాడితే నాకు కారం రాసుకున్నంత మంటగా వుంటుంది. ఐనా నువ్వన్నట్టు ఇంకో యేడాది చూస్తాను. అమ్మా నాన్నా ఏదైనా పెళ్ళి సంబంధం తెస్తే అప్పుడు చూద్దాం."

"అవును, అది మంచిదే."

"అది సరే, నీ సంగతేంటి? నో బడీ ఇంటరెస్టింగ్?" నవ్వుతూ అడిగింది భాను. ఎఱ్ఱబడ్డ మొహంతో నవ్వేసింది ఆశ.

"నాకంత సీను లేదు లేవే! చిన్నప్పుడే నాకు మా బంధువులబ్బాయితో సంబంధం నిశ్చయమైపోయింది! ఇంతవరకూ ఎవరితో చెప్పలేదు."

అదిరిపడింది భాను.

"వాట్?ఇంత పెద్ద సీక్రెట్ మా దగ్గర్నుంచి దాచి పెట్టేవా? ఇవాళ రాత్రే వాళ్ళిద్దరికీ ఫోన్ చేసి చెప్పకపోతే చూడు. మరీ ఇంత అన్యాయమా? మాకెవ్వరికీ ఒక్కసారైనా చెప్పలేదు! నువ్వే చెప్పు, నీకే ఇది బాగుందా?"

"ఆపాపు! చిన్నప్పుడు అనుకున్న సంబంధమే కానీ, మేమిద్దరమూ ఎప్పుడూ ఈ విషయమై మాట్లాడుకోలేదు. అందుకే ఎవరికీ చెప్పలేదు. అయితే ఆరు నెలల క్రితం నా పుట్టినరోజూనాడు డిన్నర్కి పిలిచాడు శరత్. అప్పుడు ఇద్దరం సరే అనుకున్నాం. శరత్ ఎల్ఐసీ లో ఆఫీసరుగా పని చేస్తారు. ప్రస్తుతం మద్రాసులో వున్నారు. హైదరాబాద్‌కి ట్రాన్స్ఫర్ కోసం అప్లై చేసారు. ఆ ట్రాన్స్ఫర్ ఆర్డర్ రాగానే ముహూర్తాలు!"

"హమ్మా! హమ్మా! ఆరు నెలలనుంచీ ఇంత పెద్ద రహస్యం గుండెల్లో దాచుకున్నావా? నీలాటోళ్ళనే గుండెలు తీసిన బంటూ అంటారు!"

"ఎహె, ఆగు! ఇదంతా ఫైనలైస్ అయింది కిందటి వారమే! ఆగస్టులో నిశ్చితార్థం చేస్తారు కాబోలు. ఇప్పుడిక అందరికీ చెప్తాను. మొట్ట మొదట చెప్పింది నీకే!"

"గ్రేట్ న్యూస్. వీలైనంత తొందరగా శరత్‌ని మాకు పరిచయం చేయాలి మరి. మన గ్రూపులో నీకే ఉద్యోగమూ, పెళ్ళీ ముందే అయిపోతున్నాయి. నీకెలా వుందో కానీ నాకు మాత్రం చచ్చేంత ఎక్సైటింగ్‌గా వుంది!"

తనూ నవ్వేసింది ఆశ. తేలిక పడ్డ మనసుతో ఇల్లు చేరుకుంది భాను.

★★★★★★★★★★★★★

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS